క్లుప్తంగా

వెటర్నరీ పాలిటెక్నిక్‌లో దరఖాస్తుల ఆహ్వానం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్‌లోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.పరశురాములు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునే విద్యార్థులు రాష్ట్రానికి చెందిన వారై ఉండి, పదో తరగతి ఉత్తీర్ణులై, టీజీ పాలిసెట్ (2025లో ర్యాంకు పొంది ఉండాలన్నారు. సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

పాఠశాలల సందర్శన



రామంచ పాఠశాలను పరిశీలిస్తున్న వనజ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా దిశ కమిటీ సభ్యురాలు వనజ సోమవారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్లు, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రాథమిక పాఠశాల ఆవరణలో మద్యం సీసాలు పడేస్తున్నారని, విద్యార్థులు భయపడుతున్నారని అలాగే ఉన్నత పాఠశాలలో ఆటస్థలం లేదని, వంట గది శిథిలమై ఉందని ఆయా ఉపాధ్యాయులు ఆమెకు వివరించారు. దీంతో వనజ స్పందించి ఈ సమస్యలను కలెక్టర్‌కు నివేదించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆమె వెంట హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫారాలు



యూనిఫారాలు అందజేస్తున్న మహిపాల్

నంగునూరు(సిద్దిపేట): పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు యూనిఫారాలు అందజేస్తామని ఏపీఎం మహిపాల్ తెలిపారు. నంగునూరు, నర్మేట పాఠశాలల హెచ్‌ఎంలకు ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం యూనిఫారాలు అందజేశారు. అనంతరం మహిపాల్ మాట్లాడుతూ మహిళా సంఘాల ఆధ్వర్యంలో అన్ని పాఠశాలలకు సరిపడా దుస్తులను సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మనీష్ కుమార్, సీసీలు లింగం, సాయిలు, భాగ్యలక్ష్మి, మౌనిక, సుజాత, జహీర్ పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులను నమ్మొద్దు



ఉపాధి కూలీలతో షీ టీమ్

నంగునూరు(సిద్దిపేట): కొత్త వ్యక్తులను నమ్మి మోసపోవద్దని షీ టీమ్ ఏఎస్‌ఐ కిషన్ గ్రామస్తులకు సూచించారు. రాజగోపాల్‌పేట పోలీసుల ఆధ్వర్యంలో నర్మేటలో ఉపాధిహామీ కూలీలకు మహిళా రక్షణ చట్టాలు, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి, సెల్‌ఫోన్‌లో జరిగే మోసాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ మహిళల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని మోసాలు జరుగుతున్నాయని, సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీలను ఎవ్వరికీ చెప్పొద్దని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ యాదవరెడ్డి, ఎఫ్‌ఏ రత్నం, కూలీలు పాల్గొన్నారు.

ఉద్యోగ పత్రం అందజేత



నియామక పత్రం అందజేస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: కారుణ్య నియామకాల్లో భాగంగా ఇటీవల మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కుమారుడికి ఉద్యోగ నియామక పత్రం అందజేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ యాదగిరి కుమారుడు వినోద్‌కు కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు విడతల వారీగా కారుణ్య నియామకాల్లో ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. వినోద్‌కు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కల్పించినట్టు తెలిపారు.

తారు మెరిసింది.. తండా మురిసింది

- రూ.6కోట్ల నిధులతో రోడ్లు పూర్తి
- ఏళ్లనాటి కల సాకారం
- ఆనందం వ్యక్తం చేస్తున్న తండావాసులు



గండిపల్లితండా నుంచి బోరింగ్‌తండాకు వెళ్లే రోడ్డు



బోరింగ్‌తండా మీదుగా దేవనాయక్‌తండా వరకు నిర్మించిన తారురోడ్డు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గండిపల్లి గ్రామ పరిధిలోని సుమారు 11 గిరిజనతండాల ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. యేళ్ల తరబడి ఎదుర్కొంటున్న రహదారి కష్టాలు మంత్రి పొన్నం చొరవతో తీరాయి. గండిపల్లి గ్రామ పరిధిలో శ్రీరామ్‌తండా, బోరింగ్‌తండా, డెక్యతండా, బాబురావుతండా, పంచరాయితండా, దేవనాయక్‌తండా, గుండ్ల సింగారం, ఏన్యానాయక్‌తండా, మంజునాయక్‌తండా, అంబనాయక్ లాంటి తదితర తండాలున్నాయి. అంబనాయక్‌తండా, శ్రీరామ్‌తండాలు ప్రస్తుతం పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి.

ఇప్పటి వరకు పడరాని పాట్లు

ఈ తండాలన్నింటికీ గతంలో సరైన రోడ్డు లేక తండాలవాసులు పడరాని పాట్లు పడ్డారు. చిన్నపాటి వర్షానికే రోడ్డంతా బురదగా మారుతుండటంతో ఆర్టీసీ బస్సులు కాదు కదా ద్విచక్రవాహనాలు కూడా ప్రయాణించలేని దుస్థితి ఉండేది. ఇక భారీ వర్షాలు కురిస్తే తండావాసులకు బాహ్య ప్రపంచానికి సంబంధాలు తెగిపోయేవి.

నిధులు ఇలా..

ఈ క్రమంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తారురోడ్ల నిర్మాణానికి గిరిజనశాఖ నుంచి దాదాపు రూ.6కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో ఎట్టకేలకు బోరింగ్ క్రాసింగ్ నుంచి బోరింగ్‌తండా, దేవనాయక్‌తండాలకు కిలో మీటర్ తారురోడ్డుకు రూ.56లక్షలు, గండిపల్లి నుంచి డెక్యనాయక్‌తండా మీదుగా శ్రీరామ్‌తండాకు 2.25 కిలో మీటర్లకు రూ.1.50కోట్లు, శ్రీరామ్‌తండా నుంచి మంజునాయక్‌తండా వరకు 3కిలో మీటర్లకు రూ.2కోట్లతో తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. అలాగే గండిపల్లి నుంచి పంచరాయితండా నుంచి గుండ్ల సింగారం మీదుగా ఏన్యానాయక్‌తండా వరకు దాదాపు రూ.2కోట్లతో తారురోడ్డు పనులు కొనసాగుతుండడంగా భూ వివాదంతో ఆగుతూ.. సాగుతోంది. ఇది కూడా త్వరలోనే పూర్తికానుందని తండావాసులు చెబుతున్నారు.

మంత్రి పొన్నంకు రుణపడి ఉంటాం



గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాలంఓ తండాలను పట్టించుకోలేదు. తారురోడ్డు సౌకర్యం లేక పడరాని ఇబ్బందులను ఎదుర్కొన్నాం. కాని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో ప్రస్తుతం తండాలన్నింటినీ కలుపుతూ తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించారు. తండావాసుల యేళ్లనాటి కల నెరవేరింది. మంత్రి పొన్నంకు ఎల్లప్పుడు రుణపడి ఉంటాం.

– వెంకటేశ్‌నాయక్, శ్రీరామ్‌తండా

తారురోడ్డు కల తీరింది



ఎన్నో యేళ్లుగా తండాలకు రోడ్లు సరిగా లేక పోవడంతో బస్సు సౌకర్యం కూడా లేకుండా పోయింది. చిన్నపాటి వర్షం పడితే చాలు రోడ్లన్నీ బురదమయంగా మారేవి. ప్రస్తుతం మా తండాలకు తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తికావడంతో చాలా సంతోషంగా ఉంది. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తండావాసుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్న.

– భూక్య రాజునాయక్, బోరింగ్‌తండా

పంట మార్పిడితోనే ఆదాయం

శాస్త్రవేత్తలు రవికుమార్, శాలిని



రైతులతో శాస్త్రవేత్తలు శాలిని, రవికుమార్

చిన్నకోడూరు(సిద్దిపేట): పంట మార్పిడితోనే సుస్థిర ఆదాయాన్ని పొందవచ్చని శాస్త్రవేత్తలు డా.రవికుమార్, డా.శాలిని సూచించారు. మండల పరిధిలోని విఠలాపూర్ రైతు వేదికలో వానాకాలం పంటలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు మట్టి పరీక్షలు చేయించుకుని సాగుకు అనుగుణంగా రసాయన ఎరువులను తగిన మోతాదులో వాడుకోవచ్చన్నారు. నేల సారవంతాన్ని బట్టి అవసరం మేరకే ఎరువులు వాడుకోవాలని సూచించారు. రైతులు కూరగాయల పంటలను సేంద్రియ పద్ధతిలో సాగుచేయాలని, తెగుళ్ల నివారణకు యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏఓ జయంత్ కుమార్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే సురక్షిత ప్రయాణం

ట్రాఫిక్ సీఐ మురళి



కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ మురళి

గజ్వేల్‌రూరల్: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తేనే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలోని కౌన్సిలింగ్ సెంటర్‌లో సోమవారం పలువురు వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మితిమీరిన వేగం, రాంగ్ రూట్లో ప్రయాణం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, మద్యం తాగి నడపడం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే అనర్థాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఏదైనా ప్రమాదం జరిగినట్లయితే ఆ కుటుంబం చిన్నాభిన్నమవుతుందని, వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం మద్యం తాగి వాహనాలను నడపబోమని వాహనదారుతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్‌ఐ జగదీశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

31 మందికి జరిమానా

పట్టణంలోని ప్రధాన చౌరస్తాల వద్ద చేపట్టిన తనిఖీలలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 31 మందిని పట్టుకున్నారు. వారిని న్యాయమూర్తి స్వాతిగౌడ్ ఎదుట హాజరుపర్చగా విచారణ అనంతరం వారికి రూ.31 వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. రోడ్డు నిబంధనలు పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



నంగునూరు(సిద్దిపేట): పాలమాకుల ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1991–92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

గ్రంథాలయ భవన నిర్మాణానికి నిధులు

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.30లక్షలు మంజూరైనట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి తెలిపారు. రూ.80 లక్షలకు గాను మొదటి విడతలో రూ.50 లక్షలు మంజూరు కాగా భవనం స్లాబ్ వరకు పూర్తి చేశారు. ప్రస్తుతం మంజూరైన రూ.30 లక్షలతో భవన నిర్మాణాన్ని పూర్తి చేయించి త్వరలోనే భవనాన్ని అందుబాటులోకి తెస్తామని ఆయన తెలిపారు. నిధుల మంజూరుకి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ ఎల్‌ఐసీ, భారత్‌నగర్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత్‌నగర్, ఎన్సాన్‌పల్లి ఎక్స్ రోడ్డు, సాజీద్‌పుర, బృందవన్, విద్యనగర్, ఎల్‌ఐసీ, మణికంఠ కాలనీలు, కుషాల్‌నగర్, ఆదర్శనగర్, శ్రీనివాస్‌నగర్, టెలికాంనగర్, దక్కల్‌కాలనీ, కేసీఆర్‌నగర్, మహాశక్తినగర్, మారుతీనగర్, ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

మృతుడి నేత్రాలు దానం



చంద్రశేఖర్(ఫైల్)

కొండపాక(గజ్వేల్): మెదడుకు సంబంధించిన సమస్యతో మృతి చెందిన యువకుడి నేత్రాలను దానం చేసి ఆ కుటుంబ సభ్యులు మానవతను చాటుకున్నారు. సిరిసినగండ్లకు చెందిన ఫొటో గ్రాఫర్ పబ్బ చంద్రశేఖర్ ఆదివారం మృతి చెందాడు. నేత్రాలను దానం చేస్తే ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి మృతుడి కుమారుడు సాయితేజకు సూచించారు. దీనికి కుటుంబ సభ్యులు అంగీకరించడంతో టెక్నీషియన్ చంద్రశేఖర్ శుక్లాలను సేకరించి వాసవీ ఐ బ్యాంక్‌కు తరలించారు. ఆ కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

◆ **విద్యార్థులే భావిభారత నిర్మాతలు**

మద్దూరు(హుస్నాబాద్): నేటి విద్యార్థులే భావిభారత నిర్మాతలుగా రూపాంతరం చెందుతారని మద్దూరు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పుష్పలత అన్నారు. అంగన్‌వాడీ సెక్టార్‌లోని టీచర్‌లకు రిలయన్స్ ఫౌండేషన్, సీఆర్‌వై(చైల్డ్ రైట్స్ అండ్ యూ) ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సరిత, మౌనిక పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం**

మిరుదొడ్డి(దుబ్బాక): కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్ స్వామిగౌడ్ అన్నారు. మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కూడవెల్లి చైర్మన్ ఉషయ్యగారి రాజిరెడ్డి, వంశీచందర్‌రెడ్డి, సుమలత, లోకేశ్‌గౌడ్, ఆత్మకమిటీ డైరెక్టర్లు స్వామి, స్వప్న పాల్గొన్నారు.

◆ **రైతులకు పట్టాలివ్వాలని వినతి**

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని రసులాబాద్‌లో ఉన్న భూదాన్ భూములలో మోకాపై ఉన్న రైతులకు పట్టాలివ్వాలని తహసీల్దార్ దివ్యకు గ్రామస్తులు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబరు 257లో మోకాపై ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వకుండా చాలా రోజులనుంచి రెవెన్యూ అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్వామి, యాదయ్య, నర్సయ్య, మల్లయ్య, భిక్షపతి, రాజు పాల్గొన్నారు.

◆ **మోదీ నేతృత్వంలోనే అభివృద్ధి**

సిద్దిపేటకమాన్: ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు వెంకట్ అన్నారు. బస్టాండ్‌చౌరస్తాలో సోమవారం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంతోష్, జనార్దన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **నిర్మాణ పనులను పరిశీలించిన ఈఓ**

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో చేపట్టిన 50 వసతి గదుల నిర్మాణ పనులను ఈఓ అన్నపూర్ణ సోమవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆమె వెంట పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నేత శ్రీనివాస్ ఉన్నారు.

◆ **ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి**

హుస్నాబాద్: వంద రోజుల కార్యక్రమాల కార్యాచరణలో భాగంగా 14వ వార్డులో సోమవారం డ్రైనేజీలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇన్‌చార్జి మేనేజరు సంపత్‌రావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, తెలంగాణ బసిల్ ఫౌండేషన్ సభ్యులు నవీన్, సాయి పాల్గొన్నారు.

గంజాయి, సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా

ఏసీపీ నర్సింహులు



దుబ్బాక: సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ

దుబ్బాక/దౌల్తాబాద్(దుబ్బాక): గంజాయి, అక్రమంగా ఇసుక, పీడీఎస్ రైస్ రవాణా, సైబర్ నేరాలపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని గజ్వేల్ ఏసీపీ నర్సింహులు ఆదేశించారు. సోమవారం ఆయన రాయపోల్, దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాలను సాధ్యమైనంత తొందరగా యజమానులకు అందించాలని, వీపీఓ వ్యవస్థను మెరుగుపర్చాలని, వారంలో రెండు సార్లు గ్రామాలను సందర్శించాలని సూచించారు. కేడీలు, డీసీలు, రౌడీలు, అనుమానితులపై నిఘా పెంచాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రజలకు అవగాహన కల్పించాలని, మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాలలో తొగుట సీఐ లతీఫ్, ఎస్‌ఐ రఘుపతి, దౌల్తాబాద్ ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

ములుగు(గజ్వేల్): మండల పరిధిలోని ములుగు, వంటిమామిడి, కొత్తూరు గ్రామాల్లో టీ స్టాళ్లు, హోటళ్లు, పాన్ డబ్బాలు, వైన్స్ షాపులు, రోడ్డు వెంబడి ఉన్న దుకాణాల వద్ద సోమవారం డాగ్ స్క్వాడ్‌తో ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత మత్తు పదార్థాలను ఎవరైనా విక్రయించినా, రవాణా చేసినా సమాచారం అందించాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

- అవకతవకలకు పాల్పడిన వారికి జరిమానా
- అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్‌గౌడ్



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని 11 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై స్థానిక రైతువేదికలో సోమవారం అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మార్చి 2024 నుంచి మార్చి 2025 వరకు చేపట్టిన పనులలో అధికారులు అవకతవకలకు పాల్పడినట్లు తెలిపారు. అవకతవకలకు పాల్పడిన పలువురు ఫీల్డ్ అసిస్టెంట్‌లకు రూ.8వేలు, అదేవిధంగా పంచాయతీరాజ్ విభాగంలో చేసిన ఉపాధి హామీ పనులకు రికార్డులు సమర్పించక పోవడంతో ఏఈ శివకుమార్‌కు రూ.5వేలు జరిమానా విధించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అధికారుల స్వయం కృపారాధన వల్లే తప్పులు జరుగుతున్నాయన్నారు. పంచాయతీ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు కలసి ఉపాధి హామీ పథకాన్ని ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. మస్టర్ నిర్వహణ సరిగా జరగడంలేదని, దానికి బాధ్యులు పంచాయతీ కార్యదర్శులేనని చెప్పారు. పని ప్రదేశంలో ఉపాధి కార్మికులకు నీడ, తాగునీరు కల్పించాలని సూచించారు. పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ శివాజీ, ఎంపీడీఓ శ్రీనివాసవర్మ, ఏపీఎం బాల లింగం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలు

హుస్నాబాద్‌రూరల్: మీర్జాపూర్‌లోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయమాల సోమవారం తెలిపారు. పాఠశాలలో 3వ తరగతి(20), 4వ తరగతి(15), 5వ తరగతి(10), 6వ తరగతి(10), 7వ తరగతి(10), 8వ తరగతి(10), 9వ తరగతిలో(10) సీట్లు ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు నేరుగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలలను కాపాడుకోవడం అందరి బాధ్యత



ముత్రాజ్‌పల్లిలో టీపీటీఎఫ్ బడిబాట ప్రచార యాత్ర

టీపీటీఎఫ్ రాష్ట్ర నేత తిరుపతిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం ఇమాంబాద్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధిస్తున్నారన్నారు. కంప్యూటర్ కోర్సులు నిర్వహిస్తున్నారని, ఉచిత నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందిస్తున్నారని చెప్పారు. అన్ని వివరాలతో కూడిన కరపత్రాలను ఉపాధ్యాయులు ప్రజలకు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు వెంకటరమణ, శ్రీదేవి, సాగర్, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను చేర్పించండి

గజ్వేల్: ప్రభుత్వ బడుల్లోనే తమ పిల్లలను చేర్పించాలని టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ కన్వీనర్ జె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ముత్రాజ్‌పల్లిలో నిర్వహించిన బడిబాట ప్రచార యాత్రలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గుచూపడం వల్ల ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పడిపోతుందన్నారు. నాణ్యమైన విద్యకు నిలయమైన ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుడు అక్కారం సత్తయ్య బృందం నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీపీఎఫ్ నాయకులు రాజులు, విద్యాసాగర్, ఎల్లయ్య, మల్లయ్య, మల్లేశం, వేణు, శ్రీనివాస్, ముత్రాజ్‌పల్లి పాఠశాల హెచ్‌ఎం సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

మెరుగైన విద్య

దుబ్బాక: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతోందని దిశ బోర్డ్ సభ్యుడు సుంకోజి ప్రవీణ్ కుమార్ సూచించారు. పట్టణంలో అంగన్‌వాడీ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు స్వామయ్య, నర్సింహారెడ్డి, జ్యోతి, శ్రీలత, నూర్‌బాబా, సంతోషి, అనిల్, స్వప్న, అంగన్‌వాడీ టీచర్ నాగరాణి తదితరులు పాల్గొన్నారు.



ఇమాంబాద్‌లో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

రామునిపట్లలో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి పిల్లలను బడికి పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభించే వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజ్ఞాన వంతమైన బోధన

మిరుదొడ్డి(దుబ్బాక): సర్కార్ బడుల్లోనే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారని ఎంఈఓ ప్రవీణ్‌బాబు చెప్పారు. మండల వనరుల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో సిద్ధం చేసిన యూనిఫారాలను ఆయా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి మెరుగైన వసతులతోపాటు విజ్ఞాన వంతమైన బోధన అందుతోందన్నారు. సర్కార్ బడుల బలోపేతానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఏపీఎం డాకయ్య, సీసీలు వైకుంఠం, మణెమ్మ, వీఓఏ మహేశ్, మండల వనరుల కేంద్రం సిబ్బంది మహేశ్, మతిన్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే భవిష్యత్

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ కళాశాలలో చేరితే బంగారు భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు కోరారు. అక్కన్నపేట మండలం ధర్మారం, గిరిజన తండాల్లో సోమవారం ఇంటింటికీ తిరిగిన లెక్చరర్లు పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ప్రవేశాలు ఇచ్చారు. ప్రైవేటు కళాశాల మోజులో ఆర్థిక ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో లెక్చరర్లు ఎల్లయ్య, వాల్య, రాజు తదితరులు పాల్గొన్నారు.